క్లుప్తంగా

14 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఈనెల 14 నుంచి కడప మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్లు కడప ఎంఈఓ పాలెం నారాయణ, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ బి. నిత్యప్రభాకర్ తెలిపారు. 14వ తేదీ వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, 15 కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, 16వ తేదీన టెన్నికాయిట్, యోగ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పైన తెలిపిన తేదీల్లో క్రీడాకారులను ఎంపికలకు తీసుకురావాలని సూచించారు.

అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న జీసీటీఏ ప్రతినిధులు

వైవీయూ : ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాలకు చెందిన డా. పి. రవిశేఖర్, డా. బి. రామచంద్రలను ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్. నీలయ్య, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు డా. శశికాంత్‌రెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో జీసీటీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదించాలి



రిలే దీక్షల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్, ఇన్‌ఛార్జి శివయ్యలు మాట్లాడుతూ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు మాతయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్నసుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

14న గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్, ఫైన్‌ఆర్ట్స్ (పెయింటింగ్, స్కల్ప్చర్), ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్, జీఆర్ఎఫ్, ఏపీ సెట్ లాంటి అదనపు అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులు అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లతో వైవీయూ పరిపాలన భవనంలో హాజరుకావాలని సూచించారు.

సైలెన్సర్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: సైలెన్సర్‌లు లేకుండా శబ్ద కాలుష్యం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బంది పెడుతున్న ద్విచక్ర వాహనదారులపై కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఉక్కుపాదం మోపారు. కడప నగరంలో శబ్ద కాలుష్యంకు గురి చేస్తున్న ద్విచక్రవాహనదారులను వారి మోటార్ సైకిల్‌తో సహా పట్టుకుని తమ కార్యాలయానికి పిలిపించుకున్నారు. అక్కడికక్కడే మెకానిక్‌లను పిలిపించి శబ్ద కాలుష్యం లేని సైలెన్సర్‌ను ద్విచక్ర వాహనదారులే ఏర్పాటు చేసుకునేలా చేశారు. ద్విచక్రవాహనదారులకు జరిమానా విధించారు. అలాగే వారి కుటుంబసభ్యులను, తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

14న డయల్ యువర్ డీఎం

మైదుకూరు : ప్రజా రవాణా సమస్యలపై గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రజా రవాణా సమస్యలను, ఫిర్యాదులను సెల్ నంబర్ 99592 25781కు తెలియజేయావచ్చని ఆయన పేర్కొన్నారు. అవకాశాన్ని మైదుకూరు డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంక్షేమ పథకాలను క్యాలెండర్ ద్వారా గడప గడపకు అందించడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక 48 వ డివిజన్‌లోని రామరాజుపల్లెలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వంకర సుజాత అనే మహిళ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా తమ కుటుంబానికి రూ.10,82,000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. సి. రాధ అనే మహిళ తనకు వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పంటల బీమా, రైతు భరోసా, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 10 లక్షల 5వేల లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసి మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామన్నారు. మా చల్లని దీవెనలతో ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, తోటక్రిష్ణ, షఫీ, సుబ్బారెడ్డి, మధు, కొండయ్య, పవర్ అల్తాఫ్, రామ్మోహన్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ , బండి మరియలు, సుశీలమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

బాబు అరెస్ట్‌పై పవన్‌కళ్యాణ్ ఓవర్ యాక్షన్

కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అరెస్ట్ చేయడంపై దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఓవర్ యాక్షన్ చేశారని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యువతీ యువకుల ఉపాధి శిక్షణ కోసం వినియోగించాల్సిన నిధులను తన జేబులోకి మళ్లించుకున్న చంద్రబాబును అరెస్ట్ చేస్తుంటే లోకేష్ కంటే పవన్‌కళ్యాణ్ ఎక్కువ హంగామా చేశారన్నారు. ప్యాకేజీ తీసుకున్న విశ్వాసంతో రోడ్లపై పొర్లు



మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

తున్నాడని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఒక పార్టీకి అధ్యక్షుడా లేక టీడీపీ కార్యకర్తనా తెలపాలన్నారు. టీడీపీ కార్యకర్తలెవరూ చేయనివిధంగా పవన్ చేసిన ఓవరాక్షన్ చూసి జనసైనికులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారన్నారు.

చంద్రబాబు నాయుడు నిప్పు కాదు... తుప్పు అని ఈ స్కాంతో తేలిపోయిందన్నారు. 27 కేసుల్లో స్టేలు తెచ్చుకొని బయట తిరుగుతున్న చంద్రబాబుకు స్కిల్డ్ స్కాంలో ఎండ్ కార్డ్ పడిందన్నారు. షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా నిధులను తమ ఖాతాలకు మళ్లించుకున్నారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, చిట్టిబాబు, కంచుపాటి బాబు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ ఉద్యమకారుడా...టీడీపీ కార్యకర్తనా!

కడప కార్పొరేషన్: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అవినీతి కేసులో అడ్డంగా దొరికి కొన్ని వందల కోట్లు స్కాం చేసి జైలుపాలైన చంద్రబాబుకు మందక్రిష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం నీతిమాలిన చర్య అని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందక్రిష్ణ రాష్ట్రంలోని మాదిగలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ వారు చేపట్టిన బంద్‌కు ఎంఆర్‌పీఎస్ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. 2014లో మాదిగల మద్దతుతో అధికారంలో కూర్చొన్న చంద్రబాబు 2019 వరకూ వారిని అణిచివేశారన్నారు. 2017లో కురుక్షేత్రం పేరుతో మందక్రిష్ణ పెట్టిన సభను జరగనీయకుండా పోలీసు బలగాలతో అడ్డుకొని ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. బాబు ఇచ్చే ప్యాకేజీకి, బిస్కట్లకు మాదిగ జాతిని తాకట్టు పెట్టడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, చిట్టిబాబు, కంచుపాటి బాబు, మనోజ్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

– కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

కడప కార్పొరేషన్ : గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో.. విజయవంతంగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు.

సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ మీటింగ్ హాల్ లో గణేష ఉత్సవాల నిర్వహణ పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ... నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో గణేశ చతుర్థి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆదేశించారు. అందు కోసం... అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలను ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. మత సామరస్యానికి ప్రతీకగా.. అన్ని మతాల ప్రజల సహకారంతో.. గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని, తాగు నీరు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో క్రేన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అలాగే.. అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి.. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే.. వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. నిమజ్జనం పాయింట్ వద్ద గజ ఈత గాళ్లను, అలాగే అగ్నిమాపకశాఖ సిబ్బందిని ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను ఉత్సవ కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని.. శాంతి కమిటీ సభ్యులను ఆయన కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ షరీఫ్, ఆర్డీవో ధర్మ చంద్రా రెడ్డి లు, పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మునగా సతీష్, జనరల్ సెక్రటరీ కే.వి లక్ష్మినారాయణ రెడ్డి, వి. శ్రీనివాసులు, శాంతి కమిటీ సభ్యులు లక్ష్మణ్ రావు, బాలకష్ణ యాదవ్, రామ్ మహేష్ ,పి మహేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి

కడప కార్పొరేషన్: దేవునికడప గుడి వద్ద ఉన్న గార్బేజ్ పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 1వ డివిజన్‌లోని పాతకడప, దేవునికడప ప్రాంతాలను పరిశీలించారు. క్లాప్ వాహనాల ద్వారా డోర్ టు డోర్ చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలన్నారు. మోడమీద పల్లె నందు నిర్మిస్తున్న శ్మశాన వాటిక ప్రహరీ చుట్టూ మొక్కలు నాటించాలన్నారు. అక్కడ ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. వాటర్ పైపులైన్ కోసం దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలన్నారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి

స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో పాతకడప ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

అటవీ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

ప్రొద్దుటూరు క్రైం : విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారుల త్యాగాలు చిరస్మరణీయమని ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ ఎస్‌వీ దివాకర్ తెలిపారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓ ఎస్ వీ దివాకర్, సిబ్బంది అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం సబ్ డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడే క్రమంలో దేశవ్యాప్తంగా ఎందరో అటవీ ఉద్యోగులు అమరులయ్యారన్నారు. దేశంలోనే అరుదైన ఎర్రచందనం మన ప్రాంతంలో అధికంగా ఉందన్నారు. ఈ అటవీ సంపదను అక్రమార్కుల బారి నుంచి కాపాడే క్రమంలో అనేక మంది అటవీ అధికారులు మృతి చెందారని తెలిపారు. అంతేగాక వన్యప్రాణుల చేతిలో కూడా ప్రతి ఏటా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అమర వీరుల త్యాగాలు మరువలేనివని ఆయన తెలిపారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్

అమర వీరుల స్ఫూర్తితో మనందరం పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవిచంద్ర, ప్రొద్దుటూరు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఎకరాను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

చాపాడు: రైతులందరూ ఖరీఫ్‌లో సాగు చేసుకున్న ప్రతి ఎకరా పంటను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ రమణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్.ఓబాయపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను సోమవారం ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతాంగం వర్షాభావ పరిస్థితుల వలన సాగు కొంచెం తగ్గిందన్నారు. మండల పరిధిలోని ఇప్పటి వరకూ 1400 ఎకరాలలో వివిధ రకాలైన పంటలు సాగయ్యాయన్నారు. సాగైన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం చాపాడులోని ఎరువుల దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. స్టాకు రికార్డులు, ధరల పట్టికలను పరి శీలించారు. నిబంధనల మేరకూ ఎరువుల విక్ర యాలు జరగాలని వ్యాపారులు సూచించారు.

రోడ్డుపై డ్రైనేజీ నీరు



కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో సోనోవిజన్ షోరూం ఎదురుగా ఉన్న వీధిలో డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో స్థానిక ప్రజలతోపాటు ఇటువైపు రాకపోకలు సాగించేవారు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఈ నీరు కాలువల్లోకి పోవడం లేదని, ఫలితంగా దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. నగరపాలక అధికారులు స్పందించి నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

14న ఉపన్యాస పోటీలు

వైవీయూ: అక్టోబర్ 2వ తేదీన న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో జరిగే జాతీయ నాయకుల నివాళి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించేందుకు ఈనెల 14వ తేదీన ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కె. మణికంఠ తెలిపారు. కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్‌హాస్టల్‌లో నిర్వహించే ఈ పోటీలకు 18–29 సంవత్సరాల మధ్య వయసు గల యువత పాల్గొనవచ్చని తెలిపారు. గాంధీ మహాత్ముని గ్లోబ్ ఇంపాక్ట్ : నేటి ప్రపంచం యొక్క గాంధేయ ఆలోచనల ఔచిత్యం అన్న అంశంపైన, లాల్ బహదూర్‌శాస్త్రి : అమృత్‌కాల్‌లో ఆయన జీవితపాఠాలు మరియు వారసత్వం అన్న అంశంపై హిందీ, ఇంగ్లీషు భాషల్లో ఉపన్యాస పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచినవారు రాష్ట్రస్థాయి, దేశస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9177616677 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మాకు న్యాయం చేయండి



ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన కార్మికులకు రూ. 8 వేల జీవనభృతి ఇవ్వాలని కోరుతున్నామని వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1.9.2014కు ముందు రిటైర్డ్ అయిన వారికి చాలీచాలని తక్కువగా పెన్షన్ అందుతున్నదని, ఈ విషయమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కనీసం రూ. 8 వేలు జీవన భృతి ఇచ్చేలా చూడాలని కోరామన్నారు. అందుకు చైర్మన్ ఈ విషయమై తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలను పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రఘునాథరెడ్డి, రహమతుల్లా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలోని అమ్మవారిశాల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుడు యేలేశ్వర గురస్వామి శర్మ వేద మంత్రాలతో అమ్మవారికి ప్రాతఃకాలపూజ, గురుపూజ, యంత్రస్థాపన, శిఖర స్థాపన, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కమిటీ అధ్యక్షుడు బియ్యపు నరసింహ ప్రసాద్, కమిటీ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు : వర్క్ షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమ వారం మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీపై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్‌షాపులు అన్ని విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సర్టిఫికెట్ కోర్సులు విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ ఉపయోగాలను వివరించారు. కన్వీనర్ ఎస్.హరినాథరెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయని తెలిపారు. జిందాల్ స్టీల్ ఇండస్ట్రీ డిప్యూటీ మేనేజర్ రవితేజ, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ రీసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్, కళాశాల డీన్ ఆచార్య కేవీ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలి

మైదుకూరు : కేసీ కాలువ ఆయకట్టు రైతులు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీడ్స్ డైరెక్టర్ శేఖర్ బాబు అన్నారు. సోమవారం మైదుకూరు మండలంలోని కేసీ ఆయకట్టు గ్రామాలైన శివపురం, అన్నలూరు పంచాయతీల్లో సాగు చేయని కేసీ కాలువ ఆయకట్టు పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం శివపురం రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న జొన్నలు, మినుముల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రైతులకు కావాల్సిన విత్తనాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు, మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న, శివపురం, అన్నలూరు సర్పంచ్‌లు కొండా భాస్కర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ వాలీబాల్ పోటీలకు మదన్



కడప స్పోర్ట్స్: ఆలిండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె. మదన్‌మోహన్ ఎంపికయ్యాడు. సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ వాలీబాల్ ఎంపికల్లో ఈయన చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యాడు. త్వరలో న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈయన పాల్గొననున్నాడు.

ఆకట్టుకునే చిత్రాలను తీర్చిదిద్దాలి



లలితకళల విభాగాన్ని పరిశీలిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : ఆకట్టుకునే చిత్రాలను గీయడంతో పాటు సమాజాన్ని చైతన్యపరిచే చిత్రాలను రూపొందించాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలోని ఆర్ట్స్ బ్లాక్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు తరగతులకు వెళ్లి విద్యార్థుల హాజరుశాతాన్ని, అధ్యాపకుల రిజిష్టర్లను, రెండవ ఇంటర్నల్స్ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం లలితకళల విభాగాన్ని పరిశీలించిన ఆయన విద్యార్థుల నైపుణ్యతను అభినందించారు. ఈ కార్యక్రమంలో లలితకళల విభాగాధిపతి డా. కోట మృత్యుంజయరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్రను విస్మరించడం సమంజసం కాదు

కడప కల్చరల్ : చరిత్రను విస్మరించడం సమంజసం కాదని ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నసీర్ అహ్మద్ అన్నారు. కడప నగరంలోని నూరే జహాన్ కల్యాణ మండపంలో రెండురోజులపాటు నిర్వహించిన స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాల ప్రదర్శన సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించేందుకు విశేష సంఖ్యలో హాజరయ్యారు. చరిత్రకారులు నసీర్ అహ్మద్ ఈ సందర్భంగా స్వాతంత్ర్య యోధుల పోరాటాలు, త్యాగాలను విద్యార్థులకు వివరించారు. దేశం నుంచి బ్రిటీషు వారిని తరిమివేయడం కోసం అనేక దశల పోరాటాలు జరిగాయని, అందులో అత్యధిక శాతం ముస్లింలు ఉన్నారని, నేటి పరిస్థితుల్లో అలాంటి త్యాగధనుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఉందన్నారు. నేడు దేశ ఐక్యత కోసం పలు రకాల త్యాగాలు చేసిన వీరుల వర్ణ చిత్రపటాలు 350కి పైగా ప్రదర్శనలో ఉంచామని, దీని ద్వారా వారి త్యాగాలను తెలుసుకుంటే చరిత్ర పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఆలిండియా మిల్లీ కౌన్సిల్ నగర సహాయ కార్యదర్శి ఇషాక్ అలీ, ముఫ్తీ సయ్యద్ బఖని, హిదాయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ, ఎస్ఆర్‌జేసీ కన్వీనర్ అహ్మద్ బాబుభాయి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర సమరయోధుల గురించి తెలియజేస్తున్న చరిత్రకారులు సయ్యద్ నసీర్ అహ్మద్